సంక్రాంతి సెలవులు పాటించాల్సిందే

శ్రీకాకుళం : అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు ఈనెల 18వ తేదీ వరకు, ఇంటర్మీడియట్ కళాశాలలు 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు పాటించాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. పండగ సెలవులను కాదని ప్రత్యేక తరగతుల నిర్వహణ పేరిట పిల్లలను మానసికంగా వేధిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. సెలవుల అమల్లో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, కమిషన్ సూచనలు పాటించని పాఠశాలలు, కళాశాలల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేయనున్నట్లు హెచ్చరించారు. ఫిర్యాదులను apscpcr2018@gmail.com మెయిల్‌కు పంపిస్తే సత్వర చర్యలు చేపడతామని తెలిపారు.

ఎస్మా చట్టం... భస్మాసురహస్తం

- జిఒ నంబరు 2ను రద్దు చేయాలి
- కార్మిక, ప్రజాసంఘాల జైల్‌భరో
- 11 మంది నాయకులు అరెస్టు, విడుదల



రాస్తారోకో చేస్తున్న కార్మిక, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీల సమ్మెను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై కార్మిక, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అంగన్వాడీలు, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతుగా మంగళవారం జైల్‌భరో కార్యక్రమం చేపట్టాయి. కలెక్టరేట్ సమీపాన పొన్నాడ వంతెన వద్ద రాస్తారోకో చేపట్టగా సిఐటియు సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలంతో పాటు 11 మందిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టం వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి భస్మాసుర హస్తం కానుందని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. అరెస్టులకు ముందు వారు మాట్లాడుతూ అంగన్వాడీలను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకొచ్చి సమ్మెను నిషేధించడం అప్రజాస్వామికమన్నారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యలతో విచ్ఛిన్నం చేయాలనుకోవడం నియంతృత్వమని ధ్వజమెత్తారు. సమ్మె కార్మికుల హక్కు అని, చట్ట ప్రకారం 15 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు వెళ్తామన్నారు. నాలుగేళ్లుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అంగన్వాడీలు సమ్మెకు దిగారని తెలిపారు. నోటీసులు ఇవ్వడం, ఉద్యోగాలు



నాగమణిని అరెస్టు చేస్తున్న పోలీసులు

తొలగిస్తామని బెదిరించడం, నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. అంగన్వాడీ అక్కచెల్లెమ్మలపై ప్రేమ ఉందని చెప్పే ముఖ్యమంత్రి వారిని రోడ్డున పడేయడం సిగ్గుచేటు అన్నారు. ఉద్యమాన్ని అణచివేయడానికి నిరంకుశ వైఖరి కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై బెదిరింపులు వెంటనే ఆపాలని, చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలన్నారు. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణ మూర్తి, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1248.51 కోట్లతో జెడ్‌పి బడ్జెట్

- ఆమోదం తెలిపిన పాలకవర్గం
- అభివృద్ధికి సహకరించాలి
- జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1248.51 కోట్ల అంచనాతో జిల్లాపరిషత్ బడ్జెట్‌ను పాలకవర్గం ఆమోదించింది. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో బడ్జెట్ అంచనాలపై చర్చించి ఆమోదం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సవరణ బడ్జెట్ మొత్తం రూ.1581.46 కోట్లు రాబడిగా అంచనా వేసి రూ.1446.33 కోట్ల మేర ఖర్చవుతుందని, రూ.135.13 కోట్ల మేర మిగులుతుందని అంచనా వేశారు. పంచాయతీరాజ్ పిఐయు ద్వారా కొత్త పథకాలు రావని అధికారులు చెప్పడంతో, గత బడ్జెట్‌కు కాస్త కుదించి వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను రూపొందించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1130.16 కోట్ల ఆదాయం వస్తుందని, సంవత్సరాంతానికి రూ.118.35 కోట్లు మిగులుతో అంచనాలను రూపొందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలలకు వచ్చిన రాబడి, వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని మిగిలిన ఆరు నెలల అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించారు. జిల్లాపరిషత్‌కు సీనరైజ్, స్టాంప్ డ్యూటీపై సర్‌ఛార్జి, రూ.4 తలసరి ఆదాయం, అద్దెలు, ఆతర ఆదాయ మార్గాలు, ఇసుక రీచ్‌ల ద్వారా రూ.10.82 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. తొమ్మిది రకాల పద్దుల కింద రూ.10.10 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

జెడ్‌పి అభివృద్ధికి సహకరించాలి

ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ సభ్యులను కోరారు. జెడ్‌పికి ఆదాయం ఇచ్చే శాఖలు సకాలంలో చెల్లించి, అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. పంచాయతీల్లో చేపడుతున్న పనులను పరిశీలించాలని సభ్యులను కోరారు. తొలుత ఇటీవల మృతి చెందిన జెడ్‌పి మాజీ ఛైర్మన్ ఎచ్చెర్ల వెంకట సూర్యనారాయణకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్, జిల్లా స్టాంపులు రిజిస్ట్రార్ కె.మన్మథరావు, పిఐయు డివిజన్ ఇఇ గిరిధర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యులు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ



మాట్లాడుతున్న చంద్రమోహన్

వైసిపి విముక్త ఎపి లక్ష్యం

జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేయాలని జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జనసేన విస్తృత సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, గ్రామ, బూత్ కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల మధ్యకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు వైసిపి నాయకులు కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని, ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరన్నారు. కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జనసేన పార్టీ సమన్వయకర్తలు విశ్వక్సేన్, గేదెల చైతన్య, ప్రవీణ్ కుమార్, ఎన్ని రాజు, పేడాడ రామ్మోహన్, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

అటవీ హక్కుల చట్టం పకడ్బందీగా అమలు

జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంత నాయక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, మెళియాపుట్టి

గిరిజన సంక్షేమానికి అంకితభావంతో పనిచేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంత నాయక్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షించారు. అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గిరిజనులే అడవికి హక్కుదారులనే విషయంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, చట్టాలు, పాలసీల ద్వారా కల్పించిన హక్కులపై గిరిజనులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. గిరిజనుల సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బంది తెలుసుకుని త్వరితగతిని వారికి న్యాయం చేయాలన్నారు. జిల్లాలో భూమి లేని ఎస్‌టి వ్యవసాయ కూలీల వివరాలు తమకు అందించాలని సూచించారు. గిరిజనాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వివరించారు. సమావేశంలో ఎస్‌టి కమిషన్ డైరెక్టర్ జయంత్ జె.సరోడే, ప్రతినిధి బృందం రాధాకాంత త్రిపాఠి, గోవర్ధన్ ముండే, పి. కె.పరీదా, దీనబంధు నాయక్, సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి, ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ డి.విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంత నాయక్

తొలుత మెళియాపుట్టిలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పోలూరు వద్ద గ్రానైట్లతో పొల్యూషన్ బారిన పడుతున్నామని, గిరిజన గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని గిరిజన సంఘ నాయకులు వాబ యోగి తదితరులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, తహశీల్దార్ పి.సరోజని తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ కమిషనర్ కృష్ణమోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సహాయక కమిషనర్ ఇ.కృష్ణమోహన్ సూచించారు. గ్రామ ప్రణాళికల తయారీపై డిపిఆర్‌సిలో మంగళవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో సిఎఫ్ఎంఎస్‌లో నివేదికలు సమర్పించే వారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా తీసుకొచ్చిన పిఎఫ్ఎంఎస్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరహాలోనే స్థానిక సంస్థలూ వార్షిక ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎంసిఆర్‌డిలు పర్యవేక్షణ మరింత పటిష్టంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిపిఆర్‌సి సమన్వయకర్త వెంకటరాజు, ఎంపిడిఒలు, ఎంసిఆర్‌డిలు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.45 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - టెక్కలి

మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా నౌపడ రైల్వే జంక్షన్ నుంచి మూలపేట గ్రామ రోడ్డు వరకు రైల్వే లైను ఏర్పాటుకు సేకరించే భూములకు సంబంధించి ఎకరాకు రూ.45 లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంతబొమ్మాళి మండలం కాశీపురం, కోటపాడుకు చెందిన 30 మంది రైతులతో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పోర్టు నిర్మాణంలో భాగంగా సరుకుల ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం రైల్వే నిర్మాణం చేపట్టనున్నామని, ఇందుకు గానూ కాశీపురం, కోటపాడుకు చెందిన 30 మంది రైతుల నుంచి 16 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు తెలిపారు.

ఎకరాకు రూ.13 లక్షల నుంచి రూ.17 లక్షల వరకు చెల్లించనునట్లు చెప్పారు. దీనిపై రైతులు స్పందిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన ధర తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఏటా రెండు పంటలు పండించే భూములను అప్పగించడమే తమకు ఇష్టం లేదన్నారు. అభివృద్ధి దృష్ట్యా అయిష్టంగానైనా భూములు ఇచ్చేందుకు సిద్ధమవుతుంటే, తక్కువ ధర చెప్పడం సరికాదన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో సంతబొమ్మాళి తహశీల్దార్ చలమయ్య, ఎల్.ఎల్.నాయుడు కోత చిన్నబాబు, కె.మధుసూదనరావు, కోత సతీష్, పూడి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



అధికారులతో మాట్లాడుతున్న ఛాన్సలర్ కె.సి రెడ్డి

ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- త్వరితగతిన వసతి భవనాల నిర్మాణం
- ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కాంట్రాక్టు పద్ధతిలో ఖాళీగా ఉన్న 190 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్ఎంపురంలో గల ట్రిపుల్ ఐటిని మంగళవారం సందర్శించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించి, చేపడుతున్న పనులపై ఆరా తీశారు. వసతి భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ పడొద్దని సూచించారు. మౌలిక వసతుల విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వచ్చే ఏడాదికి మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను నూజివీడు నుంచి శ్రీకాకుళం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ కోసం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. నాక్ బి+గ్రేడ్ వచ్చిందని ఎ గ్రేడ్ వచ్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకటగోపాల ధనబాలాజీ, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఎఫ్ఒ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, డిఇ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పలాస

జాతీయస్థాయి 47వ జాతీయ సీనియర్ బాలబాలికల టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీలు పలాసలోని జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు 24 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ క్రీడాకారులు సమానంగా తీసుకోవాలన్నారు. ఒత్తిడిని జయించే శక్తి క్రీడలకు ఉందన్నారు.



టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. తొలుత జాతీయ జెండాను మంత్రి అప్పలరాజు, ఫెడరేషన్ జెండాను మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, టెన్నికాయిట్ పతాకాన్ని టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎ.యాదయ్య ఆవిష్కరించారు. క్రీడాకారుల గౌరవ వందనాన్ని మంత్రి అప్పలరాజు స్వీకరించారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు వై.డి రామారావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎన్.వి సత్యనారాయణ, కోశాధికారి పి.తవిటయ్య, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా అధ్యక్షులు ఎం.వి రమణ, ఎఎంసి ఛైర్మన్ పి.వి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



టెన్నికాయిట్ ఆడుతున్న మంత్రి అప్పలరాజు

స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు

ప్రజాశక్తి - కొత్తూరు

రాష్ట్ర ప్రభుత్వం పథకాల పేరుతో అవినీతికి పాల్పడుతోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని గురండి పంచాయతీ దశరథపురానికి చెందిన 65 కుటుంబాలకు చెందిన వైసిపి నాయకులు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సమక్షంలో మంగళవారం టిడిపిలోకి చేశారు. వీరికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గురండిలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో ఎంపీ రామ్మోహన్ నాయుడు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనా వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, ఎంపిటిసి అగతముడి భైరాగినాయుడు, అధ్యక్షులు పాత్రుకొండ మోహనరావు పాల్గొన్నారు.

'జన భగీరథ'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు 'జన భగీరథ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని, అంబేద్కర్ స్మృతివనాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 19న ఆవిష్కరించనున్నారని, అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 18వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల పర్యవేక్షణకు కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 'జన భగీరథ' సందర్భంగా సామాజిక న్యాయంపై అవగాహనా కార్యక్రమం, రక్తదాన శిబిరాలు, అంబేద్కర్ జీవిత చరిత్రపై ఫొటో ఎగ్జిబిషన్లు, మారథాన్, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు, గ్రామాలు, పట్టణాల్లో అంబేద్కర్ విగ్రహాల అలంకరణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలంతా పెద్దఎత్తున భాగస్వాములు కావాలని కోరారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష, కెజిబివిల్లో పనిచేస్తున్న 18 విభాగాల ఉద్యోగులు 21 రోజులుగా కలెక్టరేట్ వద్ద జ్యోతిరావు పూలే పార్కు వద్ద నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం బైక్ ర్యాలీ చేపట్టారు. నగరంలోని ఎన్‌జిఒ హోం నుంచి కలెక్టరేట్ వరకూ ఈ ర్యాలీ సాగింది. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి యథావిధిగా విధుల్లోకి వెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ జెఎసి అధ్యక్షులు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. పండగ పూట పస్తులు ఉండాల్సిన స్థితి కల్పించి ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారని విమర్శించారు. సంఘ నాయకులు శివని నాయుడు మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసరావు, గిరిధర్, పోతయ్య, శివ, యుగంధర్, నరసింగరావు, ప్రసాదరావు, తెలజ, అరుధంతి, ఉషారాణి, అరుణకుమారి, జ్యోతి పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి - కంచిలి


కంచిలి : నోటీసులు అందజేస్తున్న పోలీసులు

ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరుతూ విజయవాడలో నిర్వహించనున్న 36 గంటల ధర్నాలో పాల్గొనకుండా తమను నిర్బంధించడం అన్యాయమని కంచిలి యుటిఎఫ్ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం యుటిఎఫ్ జిల్లా ఆడిట్ సభ్యుడు సుదర్శన్ బెహరాతోపాటు సభ్యులు నల్లన రవి, మురళి నాయక్, త్రినాథ్ సాహూ, జకబ్ లిమ్మా అనురాధ తదితరులకు స్థానిక పోలీసులు ముందస్తు నోటీసులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ నిరసన వ్యక్తం చేసేందుకు వెళుతుంటే ఇలా నిర్బంధించడం సరికాదన్నారు. నిర్బంధాలతో పోరాటాలను అణచలేరన్నారు.

టెక్కలి: ఉపాధ్యాయుల పెండింగ్ ఆర్థిక బకాయిలపైన, డిఎలు చెల్లింపైన చేయ్యా... తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు యుటిఎఫ్ ఆధ్వర్యాన విజయవాడలో 36 గంటలు ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు వెళ్లనీయకుండా ఉపాధ్యాయులను పోలీసులు నిర్బంధించారని యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు కురమాన దాలయ్య అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ముందస్తు అరెస్టు చేసి నిర్బంధించడం సమంజసం కాదన్నారు. నిర్బంధంలో తమ్మినేని వైకుంఠరావు, డొంకన పాపారావు, గణపతిరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ 33 కెవి లైన్ పనులు నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టౌన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా వేస్తున్న 33 కెవి లైన్‌లో ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో స్థానిక బస్టాండ్ ఏరియా, సచివాలయం పరిధి, చింతామణి అమ్మవారి రోడ్డు పరిధిలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఏం చేసినా సమ్మె కొనసాగిస్తాం


టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని తక్షణమే రద్దు చేసి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరవధిక సమ్మెను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం, బెదిరింపులు, నోటీసులు ఇవ్వడం మానుకోవాలని సూచించారు. అంగన్వాడీలు 29 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోవడం దారుణమన్నారు. అంగన్వాడీల సంక్షేమానికి గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్.ఈశ్వరరావు, నంబూరు షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య పాల్గొన్నారు.

నగరంలోని కలెక్టరేట్ వద్ద జ్యోతిభాపూలే పార్కు ఎదుట ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన 24 గంటలు నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరాయి. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి అల్లు మహాలక్ష్మి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ శిబిరానికి మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుశీల, బి.ఉత్తర మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, అల్లు సత్యనారాయణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి పాల్గొన్నారు.

రణస్థలం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఆమదాలవలస ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో అంగన్వాడీల సంఘం నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, పి.లక్ష్మి, మాధవి, కనకం, పి.లక్ష్మి పాల్గొన్నారు.

పలాస-కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలో కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి, బి.చామంతి, బి.నిర్మల, జయలక్ష్మి, నారాయణి, ఆర్.భవాని పాల్గొన్నారు.


కొత్తూరు : మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


శ్రీకాకుళం అర్బన్ : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

పొందూరు తహశీల్దార్ కార్యాలయం చేపట్టిన నిరవధిక సమ్మెలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం, రమణమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

కొత్తూరు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు మెడకు ఉరివేసుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.లక్ష్మి, ఎస్.ధనలక్ష్మి, జలజాక్షి, నిర్మల, బోడమ్మ, సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, యూనియన్ నాయకులు. అరుణ, ఉత్తర, నిర్మల, లక్ష్మి, ప్రమీల, మధురవేణి, శశివర్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, గొండు నీలన్న, దుంపల సుదర్శన పాల్గొన్నారు.

సారవకోట సమ్మె శిబిరంలో అంగన్వాడీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధ పాల్గొని మాట్లాడారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి


శ్రీకాకుళం అర్బన్ : సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పి చర్చల పేరుతో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ మంగళవారం కార్మికులు పంగ నామాలు పెట్టుకుని నిరసన తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన శిబిరంలో పలువురు సంఘ నాయకులు మాట్లాడారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్ మాట్లాడారు. పాదయాత్రలో అసెంబ్లీ సాక్షిగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, ఎ.శంకరరావు, ఆర్.జి.రాము, ఎ.శేఖర్, ఎ.రాజేష్, టి.వెంకటలక్ష్మి, టి.మల్లమ్మ, జె.మాధవి, ఎ.మోహన్, డి.యుగంధర్, ఎం.నారాయణరావు పాల్గొన్నారు. సమ్మె శిబిరంలో సిఐటియు సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు నాగమణి, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సంఘ నాయకులు ఉత్తర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఆమదాలవలస : పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పారిశుధ్య కార్మిక నాయకుడు తాడి సంతోష్ అన్నారు. పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం తీరు వల్ల తాము గడ్డి తిని బతుకుతున్నామని గడ్డిని తింటూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, తారకేశ్వరరావు, జె.శ్రీను పాల్గొన్నారు.


పలాస : ఆందోళన చేస్తున్న కార్మికులు


ఆమదాలవలస : గడ్డిని తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మున్సిపాల్ కార్మికుల నిరవధిక సమ్మెకు ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు సంఘీభావం తెలిపారు.

పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరధిక సమ్మెలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : నిరవధిక సమ్మెలో భాగంగా పారిశుధ్య కార్మికులు పంగనామాలు పెట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.


పొలానికి నీరు కడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

పొలం పనుల్లో ఎమ్మెల్యే బిజీ

ప్రజాశక్తి- రణస్థలం

ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఒకవైపు ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తూనే... మరోవైపు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ తన సొంత మండలంలోనిపాతర్లపల్లిలో సామాన్య వ్యవసాయ రైతులాగ రైతు కూలీలతో కలిసి మంగళవారం వ్యవసాయ పనులు చేస్తూ కనిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టిన వారు రాజకీయాలు చేస్తున్నా, వ్యాపారాలు చేస్తున్నా, ఉద్యోగాలు చేస్తున్నా సొంత పొలంలో వ్యవసాయ పనులు చేస్తే ఆనందం చెప్పలేనిదన్నారు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులు చేస్తుంటానని తెలిపారు.

ర్యాంకర్‌కు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


సన్మానిస్తున్న డాక్టర్ శ్రీధర్

ఆలిండియా వైద్య విద్య ప్రవేశానికి నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ ఎడ్యుకేషన్ టెస్టు యుజిలో ఫస్టు ర్యాంకు సాధించిన జిల్లాకు చెందిన వరుణ్‌తేజ్‌ను మెడికవర్ ఎండీ డాక్టర్ దానేటి శ్రీధర్ అభినందించారు. మంగళవారం మెడికవర్ ఆస్పత్రిలో ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరెన్నో ఉన్నత శిఖరాలు అదిరోహించాలని కోరారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన వరుణ్ తేజ్ జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలిపారన్నారు.

నేడు సంక్రాంతి జనకవనం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు సంక్రాంతి జనకవనం నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రముఖ కవులు పాల్గొని స్వీయ కవితా పఠనం చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడును కలెక్టరేట్‌తో అభినందన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొవాలని కోరారు.


రోడ్డును పరిశీలిస్తున్న చిరంజీవినాగ్

రహదారుల అభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి- పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో పలు గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలో చిలకపాలెం-రాజాం రహదారి నుంచి కేశవదాసుపురం వరకూ 1400 మీటర్లు పొడవున రూ.50 లక్షల సిఎండిఎఫ్ నిధులతో నిర్మాణం చేపట్టిన రహదారిని మంగళవారం పరిశీలించారు. రహదారి నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు, వండాన సూరపనాయుడు, మజ్జి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను అడ్డుకుంటున్న టిడిపి నాయకులు

ఇసుక తవ్వకాలు అడ్డగింత

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఎటువంటి అనుమతులు లేకున్నా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలనూ లెక్క చేయకుండా యథేచ్ఛగా వంశధార, నాగావళి నదుల్లో పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోనట్లు వ్యవహరించడం సరికాదని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండ శంకర్ అన్నారు. గార మండలం బూరవల్లి సమీపాన వంశధార నదిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను టిడిపి నాయకులతో కలిసి మంగళవారం అడ్డుకున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను తక్షణమే నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండ భాస్కరరావు, రమణమూర్తి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బడగల వెంకట అప్పరావు, శాలిహుండం సర్పంచ్ కొంక్యాన అదినారాయణ, వాడాడ మాజీ సర్పంచ్ శిమ్మ శ్రీను పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- రణస్థలం రూరల్


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1987-92 సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ కలయిక సమావేశం ఏర్పాటు చేశారు. అప్పుడు పనిచేసిన ఉపాధ్యాయులు పిన్నింటి సూర్యనారాయణ, ఆకుల సన్యాసినాయుడు, మీసాల లక్ష్మంనాయుడు, ఎస్.సత్యవతి, డి.ఎన్ ప్రసాదరావు, ఎం.లక్ష్మణరావు, ఎం.ధర్మారావు, బి.చంద్రశేఖర్, ఆర్.లక్ష్మణరావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ చదివి విద్యాశాఖ లోనే పనిచేస్తున్న లావేరు మండలం విద్యాశాఖ అధికారిగా లండ ఈశ్వరరావు, రణస్థలం జూనియర్ కాలేజీ లెక్చలర్‌గా బాలి వేణుగోపాలనాయుడు, అనపర్తి వెంకటరావు, కందుల వెంకటరత్నం వివిధ వాదాల్లో స్థిరపడడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

ఎంఇఒల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా మండల విద్యా శాఖాధికారులు (ఎంఇఒ) సంఘ కార్యవర్గం మంగళవారం నగరంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో నిర్వహించారు. జి.సిగడాం ఎంఇఒ ఎ.రవి పర్యవేక్షణలో ఈ ఎన్నిక నిర్వహించారు. సంఘం జిల్లా శాఖ అధ్యక్షునిగా జె.చిన్నవాడు (సంతబొమ్మాళి), ప్రధాన కార్యదర్శిగా పి.దాలినాయుడు (నరసన్నపేట), కోశాధికారిగా యు.శాంతారావు (నరసన్నపేట), రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.పున్నయ్య (ఎచ్చెర్ల), గౌరవ అధ్యక్షుడిగా జి.రాజేంద్రప్రసాద్ (ఆముదాలవలస), ఉపాధ్యక్షులుగా కె.రాంబాబు (హిరమండలం), సిహెచ్.తిరుమలరావు (పాతపట్నం), శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శిగా ఎం.మురళీకృష్ణ (లావేరు), టెక్కలి డివిజన్ కార్యదర్శిగా జి. చిన్నారావు (టెక్కలి) ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో జిల్లాలోని 30 మండలాల నుంచి 58 మంది ఎంఇఒలు పాల్గొన్నారు.

బిఎడ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి


పలాస : రాష్ట్ర వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బిఎడ్ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్) అర్హత సాధించిన విద్యార్థులకు తక్షణమే కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. పలాస పిడిఎస్యుయు జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2023 మార్చి నెలలో నోటిఫికేషన్ ఇచ్చి, జూన్ నెలలో పరీక్షలు నిర్వహించి, జులై 14న ఫలితాలను విడుదల చేశారని అన్నారు. ఫలితాలు విడుదలై ఆరు నెలల పూర్తవుతున్నా ఇప్పటి వరకు కౌన్సెలింగ్ నిర్వహించలేదని పేర్కొన్నారు. దీంతో 10,908 మంది విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జగనన్న హయాంలో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. మండలంలోని అమలపాడులో ఇంటింటికి వెళ్లి పెరిగిన పింఛను సొమ్ము రూ.మూడు వేలు చొప్పున లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదప్రజలకు మేలు చేసే ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్ ప్రభుత్వం అన్నారు. అవ్వ తాతలకు, వికలాంగులకు, వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం పింఛను రూ.3 వేలు పెంచారని అన్నారు. పంచాయతీలో 476 మందికి వివిధ రకాల సామాజిక పింఛన్లు అందుతున్నాయని తెలిపారు.


వజ్రపుకొత్తూరు : పోస్టర్లను ఆవిష్కరిస్తున సర్పంచ్ బాలరాజు


ఆమదాలవలస : పింఛను అందజేస్తున్న జెడ్‌పిటిసి గోవిందరావు

ఆమదాలవలస : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్‌పిటిసి బెండి గోవిందరావు అన్నారు. మండలంలోని వంజంగిలో పింఛను పెంపు కానుకను పంపిణీ చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 3 వార్డు పెంటిభద్రలో గడప గడపకు మన ప్రభుత్వం రూ. 5 లక్షల వ్యయంతో బోర్, పైపులైన్ ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీరు కోసం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్య పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో బోర్‌తో పాటు వంద మీటర్లు దూరం వరకు పైపులైన్ ఏర్పాటుకు పనులు ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే గిరిజన గ్రామాల్లో సిసి రోడ్లు కాలువలు నిర్మాణం చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఎఇ అవినాష్ పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ సేవలు స్ఫూర్తిదాయకం

సుదీర్ఘ కాలంగా ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడంలోనూ ఎఐవైఎఫ్ నిర్వహిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో ఎఐవైఎఫ్ కేలెండర్‌ను ఆవిష్కరించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరు వాసుదేవరావు, కొన్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న గిరిబాబు

సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పూర్తి


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస : ఏటా వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జగనన్న సంక్రాంతి సంబరాలకు రావికంటిపేట మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. జిల్లాలో ఎక్కడా జరగని విధంగా కనివిని ఎరుగని రీతిలో నిర్వహించనున్న జిల్లా స్థాయి కబాడీ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో ఏటా జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాదీ జనవరి 11, 12 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు శ్రీకారం చుట్టామని రవికుమార్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులంతా ఈ పోటీలలో పాల్గొని వారి ప్రతిభను చాటుకోవాలని కోరారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విన్నర్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.40 వేలు, మూడో స్థానం సాధించిన జట్టుకు రూ.30 వేలు, నాగులో స్థానం సాధించిన జట్టుకు రూ.30 వేలు నగదు, ప్రైజ్ మనీ అందజేస్తామని తెలిపారు. క్రీడా ప్రాంగణం, పరిసర ప్రాంత ఔత్సాహిక మహిళలంతా 12న నిర్వహించే ముగ్గుల పోటీలల్లో పాల్గొనాలని కోరారు.

ఆరోగ్య రక్ష... జగనన్న సురక్ష

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న సురక్ష ఆరోగ్య రక్ష అని ఎమ్మెల్సీ రామారావు, వైసిపి సమన్వయ కర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలో లొద్దపుట్టిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగుతుందని అన్నారు. ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, సల్ల దేవరాజ్ పాల్గొన్నారు.

రాపాకలో పారిశుధ్య పనులు

పొందూరు : మండలంలోని రాపాకలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు ఆధ్వర్యాన మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రధానవీధితో పాటు పలు వీధుల్లో కాలువల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారాలను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈయనతో పాటు వార్డు సభ్యులు కొంచాడ సురేష్, తదితరులు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న గిరిబాబు

ముందస్తు సం'క్రాంతి'


వజ్రపుకొత్తూరు : గంగిరెద్దును ఆడిస్తున్న డూడూ బసవన్న

ప్రజాశక్తి- పలాస

పలాస మదర్ థెరిసా పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాంయు సంపదాయ దుస్తులను ధరించి సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా ప్రదర్శించారు. రోకళ్లతో దంచడం, పలు రకాల వంటకాలు చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటల్లో బోగి పళ్లు వేస్తూ సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వజ్జ బాబూరావు, కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, చిరంజీవి, లక్ష్మణరావు, శశిరేఖ, ఉషా, రేవతి, బేబీ, యశోద, జీవరత్నం, సావిత్రి, స్రవంతి పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం కోత చైతన్య ఆధ్వర్యాన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ముగ్గులు వేశారు. భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, రవికుమార్, విజయలక్ష్మి, మార్కండేయులు, కృష్ణవేణి, రోజా పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు భోగి మంటలు ముట్టించి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు రంగవల్లికలు, వేషధారణలతో ఆకట్టుకున్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూండిలోని సాయి వినీత్ విద్యా సంస్థల ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాలు విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంతో జరుపుకున్నారు. విద్యాసంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చాపర లీల కోదండరావు పర్యవేక్షించారు. సంప్రదాయాలకు అద్దం పడుతూ ధరించిన వివిధ వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. డుడు బసవన్నంటూ గంగిరెద్దుల వాళ్లు ఆడించిన గంగి రెద్దుల బాగోతం పిల్లలను ఆకట్టుకుంది. సందర్భంగా భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నేపు కైలాష్‌రావు, ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న శ్రీసాయి విద్యా మందిర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మణరావు ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సంస్కృతి, సంప్రదాయాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. భోగి మంటలు, ముగ్గుల పోటీలు, హరిదాసు గానం, గంగిరెద్దులు, కోలాటం, కూచిపూడి, భరత నాట్యం, రైతు వేషధారణలచే ఉదయం నుంచి సాయింత్రం వరకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సీపాన లక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయులు పాండు రంగారావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చౌదరి ధనలక్ష్మి, కార్యదర్శి పప్పల తిరుపతిరావు, కోటేశ్వరరావు, తవిటిరాజు, పిఎస్ మహాలక్ష్మి పాల్గొన్నారు.


టెక్కలి : ముగ్గు వేస్తున్న విద్యార్థిని

టెక్కలి : చిన్నారి దశ నుంచే విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలను విస్తరించే విధంగా కృషి చేయాలని బిఎస్‌జెఆర్ విద్యా సంస్థల కరస్పాడెంట్ డాక్టర్ కోత మురళీధర్ అన్నారు. స్థానిక వృందా కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.అనూప్‌కుమార్, పి.ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక మహర్షి స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జంగమ వేషం, హరిదాసు వేషం, ఎరుకల వేషం వేసి, డప్పు వాయిస్తూ నృత్య ప్రదర్శన చేపట్టారు. రంగవల్లి పోటీలు, గాలిపటాలు ఎగరవేత, ఫుడ్ ఫెస్టివల్ ప్రదర్శించారు. అనంతరం భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రాంబాబు, రామానుజన్, రామారావు, కిరణ్‌కుమార్, కన్నబాబు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర విజయోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పార్టీలకతీతంగా సంక్షేమం

ప్రజాశక్తి- లావేరు

అన్ని తరగతుల సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలనలో సిఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందుతున్నాయని, లంచాలకు తావులేదని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారమే ఇప్పుడు రూ.3 వేలు పింఛను ఇస్తున్నారని అన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్ కుమార్, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీశాల సీతం నాయుడు, వైసిపి అధ్యక్షుడు దన్నాన రాజనాయుడు, సర్పంచ్ కొల్లి ఈశ్వరరెడ్డి, ఎంపిటిసి కాగితాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పట్టాలు పంపిణీ

రణస్థలం : స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రణస్థలం మండలం సంచాం, పాతర్లపల్లి, మరువాడ గ్రామాలకు చెందిన పేద కుటుంబాలు సాగుచేసుకుంటున్న భూములకు లబ్ధిదారులకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలంతా వ్యవసాయ చేసుకుని అభివృద్ధి చెందాలని, పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు కుమార్ ఎంపిక

టెక్కలి : ఈ నెల 9 నుంచి 12 వరకు రాజస్థాన్ రాష్ట్రం జంజూమా పట్టణంలో జరగనున్న ఆల్‌ఇండియా యూనివర్సిటీ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు టెక్కలి క్రీడా వికాస్ కేంద్రానికి చెందిన పూడి కుమార్ ఎంపికయ్యారని కోచ్ నర్సిపురం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన కుమార్ స్థానిక ఆదిత్యా ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నారని అన్నారు. కుమార్ ఎంపికపై జిల్లా క్రీడాశాఖాధికారి కల్లేపల్లి శ్రీధర్, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నాగేశ్వరరావు అభినందించారు.



విశ్రాంత బల్లలను ఏర్పాటు చేస్తున్న సభ్యులు

విశ్రాంత బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని ఆలయాల వద్ద మన జనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మంగళవారం సిమెంట్ విశ్రాంత బల్లలు ఏర్పాటు చేశామని విలేకరి బలివాడ శ్రీనివాసరావు తెలిపారు. కొండములగాం, కామ్మసిగడాం, అర్జునవలస, వేల్పురాయి, రణస్థలం, తెప్పలవలస, కోటపాలెం భద్రమహంకాలి, కమ్మసిగడాం, మహాలక్ష్మి ఆలయాల వద్ద వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెలాఖరు లోపల అన్ని గుడులు వద్ద వీటిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మన జనం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జనపల గోవిందరావు, స్థానిక నాయకులు టెకే బ్రహ్మజీ, పిన్నింటి సత్యంనాయుడు, గంగి హరిబాబు, ఉల్లాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి పి. ఉమామహేశ్వరి గర్భిణీలకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ వంటి తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గర్భిణులకు స్థానిక శ్రీ సత్య సాయి సేవ సమితి నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష మాత అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ. శాంతి కుమారి, -ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని బైపాస్ కూడలి వద్ద ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రకు మంగళవారానికి ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ సిఎం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి మొదలవలస చిరంజీవి, ఎస్.ఎం.పురం పిఎసిఎస్ చైర్మన్ సనపల నారాయణరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా ప్రజా సంకల్ప విజయా స్థూపం వద్ద వైసిపి నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైసిపి సమన్వయ కర్త పిరియ సాయిరాజ్ పాల్గొని మాట్లాడారు. మండలంలోని లొద్దపుట్టి తులసమ్మ ఆలయం ప్రాంగణంలో ప్రజా సంకల్ప విజయ స్థూపం వద్ద 3,648 కిలో మీటర్ల దూరం



రామారావుకు కేకు తినిపిస్తున్న సాయిరాజ్

ప్రజా సంకల్ప పాదయాత్ర ముగింపునకు ఐదేళ్ల పూర్తయిందని అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, చైర్‌పర్సర్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ భారతీదివ్య, దేవదాసురెడ్డి, కడియాల ప్రకాష్, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

నందిగాం : వైసిపి కార్యాలయం వద్ద చేపట్టిన కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు టి.ఫాల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, అంబోడి విష్ణు, లవునిపల్లి ధనరాజ్, బార్నాన బాలకృష్ణ పాల్గొన్నారు.

సోంపేట: ముఖ్యమంత్రి జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తి చేసి ఐదేళ్ల పూర్తి కావస్తున్న సందర్భంగా మొగల్ కొత్తూరులో సిఎం చిత్రపటానికి ఎంపిపి నిమ్మక దాస్, మహిళలు పాలాభిషేకం చేశారు. అంతకుముందు గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బి.ధర్మరాజు, ఎం.వెంకటరమణ, పి.కామేష్, తోట ఢిల్లీ, రమేష్, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంగోపాల్

18న యూనివర్సిటీ ఎదుట ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఇటీవల చేపట్టిన అడ్డగోలు నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్ డిమాండ్ చేశారు. నగరంలోని అంబేద్కర్ భవనంలో మంగళవారం ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియామకాల్లో రిజర్వేషన్ ఉల్లంఘనకు పాల్పడి పోస్టు వారీగా ధరలు నిర్ణయించి అమ్మేశారని ఆరోపించారు. తక్షణమే ఈ నియామకాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా చేపడుతున్న నియమకాల్లో ఎస్‌సి, ఎస్‌టి రోస్టర్ రిజర్వేషన్ ప్రాతిపదికను పక్కనపెట్టి రాజకీయం, బంధుప్రీతి, కులం, రూ.లక్షలాదిగా వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. దళిత ఆదివాసీలకు ప్రాధాన్యత లేకపోవడం తీవ్ర అన్యాయంగా భావిస్తున్నామన్నారు. కులనిర్మూళన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య మాట్లాడుతూ నియామకాల రద్దు కోరుతూ ఈ నెల 18న యూనివర్సిటీ ఎదుట దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ధర్నా చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సామజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, అంబేద్కర్ చైర్ నిర్వహణ కమిటీ నాయకులు టొంపల రమణ, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, ఆరుబారికి అప్పారావు, నిడిగంట్ల రమణమూర్తి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు యాడ్ల జానకిరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి- పలాస

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే వాటిని అడ్డుకోవాలని జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ డి.సీతారాములు సూచించారు. పలాస మండల మహిళా సమాఖ్య (వెలుగు) కార్యాలయంలో ఎపిఎం బి.మల్లేశ్వరరావు అధ్యక్షతన ఎంఎంఎస్ కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యాన వైఎస్ఆర్ క్రాంతి పథం గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు కార్యనిర్వహక సభ్యుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు వల్ల కలుగు ఆర్థిక, శారీరక, మానసిక, సామాజిక రాజకీయ



మాట్లాడుతున్న సీతారాములు

పరమైన నష్టాలను వివరించారు. గ్రామస్థాయిలో బాలల రక్షణ కమిటీల ద్వారా పొదుపు సంఘ సభ్యులు బాల్య వివాహాలు నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.జాష్మిన్ కుమారి, సూపర్‌వైజర్ కె.భాగ్యలక్ష్మి, ఎస్.వైకుంఠరావు, అప్పలనారసమ్మ, ఐసిడిఎస్ పిఒ వరలక్ష్మి సుగుణమ్మ, రేణుక, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

పలాస : పలాస కోమిటివీధికి చెందిన డోకి విశ్వనాథం అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని విషయం కాశీబుగ్గ వైశ్య సంఘం సభ్యులు తెలుసున్నారు. ఈ మేరకు రూ. 36,300 ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బెల్లాల నర్సింగరావు, కాశీబుగ్గ వైశ్య యువజన సంఘం అధ్యక్షులు కోట్ని విజయకుమార్, సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ పెంట శ్రీను, సెక్రెటరీ బోయిన విజయ్, యువజన సంఘం ట్రెజరర్ వడ్డీ వెంకి, పి.కె.శ్రీనివాస్, లండ నాగరాజు పాల్గొన్నారు.

మండలంలోని మాకన్నపల్లికి చెందిన జుత్తు నరేష్‌కు జిఎస్‌టి అదనపు విశ్రాంత కమిషనర్ జుత్తు తాతారావు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల రంగోయి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న తాతారావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ తెప్పల అప్పలస్వామి ఉన్నారు.

కొల్లివలస సంత కిటకిట

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కొల్లివలస కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన సంత ప్రజలతో కిటకిటలాడింది సంక్రాంతి పండగలో భాగంగా స్థానికులు కొత్త మట్టి కుండలు, నాటు కోళ్ళు, బెల్లం, గొర్రెలు, మేకలు, కొత్త దుస్తులు సంతలో విక్రయించేందుకు వచ్చారు. దీంతో స్థానికులు వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు.



ఏదేమైనా పల్లెలకు సంక్రాంతి శోభ వచ్చిందని స్థానికులు ఉత్సాహంగా తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసుకున్నారు.



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి కిరణ్‌కుమార్

పశు వ్యాధులపై అప్రమత్తం

కోటబొమ్మాళి: పశువులకు శీతాకాలంలో ఎక్కువ వ్యాప్తి చెందుతున్న గాలికుంటు వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంతగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దంత, గంగరాం, గుంజిలోవ, మంచాలపేట, తాటిపర్తి, లఖందిడ్డి తదితర గ్రామాల్లో 867 పశువులకు సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాలు వేశామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, సర్పంచ్‌లు పేడాడ వెంకటరావు, గొండు చాందిని, మురళి, పశువైద్య సిబ్బంది బలరాం, జ్యోతి, లక్ష్మీనరసమ్మ, ధర్మారావు, నారాయణరావు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ

ప్రజాశక్తి- పొందూరు

నారా చంద్రబాబునాయుడుతో రాష్ట్రానికి భవిష్యత్ గ్యారెంటీ అని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్.రామ్మోహన్ అన్నారు. మండలంలోని లోలుగులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన అధికారం చేపడితే అమలు చేయనున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత జనరల్ సెక్రటరీ బలగ శంకర్‌భాస్కరరావు, లోలుగు వెంకట్, చోళ్ల శ్రీనివాసరావు, సింహాద్రినాయుడు పాల్గొన్నారు.



సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న సభ్యులు

హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి- సోంపేట

పట్టణ పరిధిలోని రహదారుల్లో మలుపుల వద్ద, స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు వైశ్యరాజు గోపి కిరణ్, రవితేజ, కృష్ణారావు, సుమన్, ప్రసాద్, పింటూ తదితరులు పట్టణ పరిసరాల్లోని రహదారుల వద్ద 16 సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ బోర్డులు ఎంతో సహకరిస్తాయని ఆకాంక్షించారు.

యువకుల సైకిల్ సాహసయాత్ర

పలాస : సంపూర్ణ శుక్ల కేంద్ర రంగ సంస్థ ఆలిండియా రేడియో లక్నోలో జాకీగా పనిచేస్తున్నారు. ఈయన సేవ్-2 వాటర్-సేవ్ లైఫ్ అనే నినాదంతో గతేడాది ఆగస్టు 3న దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర ప్రారంభించారు. మద్యపానం, మారకద్రవ్యాలు వినియోగం వల్ల యువతకు కలిగే దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో సీతారామాలయానికి చేరుకున్నారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఆశిష్

యోగాలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో రామకృష్ణాపురం వద్ద ఉన్న శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో 7వ తరగతి చదువుతున్న సంపతిరావు ఆశిష్ స్థానం సంపాదించారు. ఓం ప్రీ యోగా సంస్థ ఆధ్వర్యాన విశాఖ బీచ్ రోడ్డులో గల గాదెరాజు ప్యాలెస్ వేదికలో మంగళవారం నిర్వహించిన 216, 108 రౌండల సూర్యనమస్కారాల్లో పాల్గొని ప్రతిభను చాటారు. నిరంతరాయంగా 88 నిమిషాల్లో 2,592 అసనాలు వేసి యోగాలు వేశాడు. ఈ పోటీల్లో విశాఖ నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, మన్యంపార్వతీపురం, రాజమండ్రి, ఎలూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి 270 మంది యోగాభ్యాసుకులు యోగాసనాలు వేశారు. ఆశిష్ గతేడాది జాతీయస్థాయి నంది బాలరత్న అవార్డును అందుకున్నారు. మూడుసార్లు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశీష్ను శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు, స్కూల్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, శరత్బాబ శ్రీను అభినందించారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి కృషి చేస్తున్నారని వైసిపి సమన్వయ కర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని ప్రజా సంకల్ప విజయా స్థూపం వద్ద మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ వారసత్వాన్ని స్మరించుకునేందుకు సిఎం రూ.404 కోట్లతో విజయవాడ సిటీలో స్వరాజ్య మైదానం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్మాణం ఈ నెల 19న సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపిలు బోర పుష్ప, దేవదాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ భారతీదివ్య, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఇ.కృష్ణారావు, కడియాల ప్రకాష్ పాల్గొన్నారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని పలువురు ప్రముఖులు మంగళవారం సందర్శిం చారు. చెన్నయ్ బిఎస్ఎన్ఎల్ సిజిఎం పి.మురళీమోహన రావు, నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ సభ్యులు జి.అనంత్ నాయక్, విశాఖ నగర ట్రాఫిక్ ఎసిపి రాజీవ్ కుమార్ కుటుంబ సభులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం వారికి స్వామివారి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాలను ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. వారితో పాటు శ్రీకాకుళం ఆర్‌డిఒ రంగయ్య, తహశీల్దార్ ఎస్.వెంకటరావు ఉన్నారు.

నేడు బాలకృష్ణమ్మ స్మారక సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్య సమరయోధుడు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ 11వ వర్ధంతి సందర్భంగా నగరంలోని కళింగ భవన్‌లో బుధవారం స్మారక సభ నిర్వహిస్తున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టెంక చలపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు విద్యావేత్త కె.ఎస్.చలం ప్రధాన వక్తగా పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యావేత్తలు పాల్గొవాలని కోరారు. ఈయన వెంట సన్నశెట్టి రాజశేఖర్, చింతాడ దిలీప్ కుమార్ ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని లఖందిడ్డి పంచాయతీ తలగానపేటకు చెందిన ఉప్పాడ రోహిణిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ఉప్పాడ అప్పన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్‌మహ్మద్‌అలీ మంగళవారం తెలిపారు. రోహిణిరావు తన పశువుల పాకలో మట్టిని సదును చేస్తుండగా తన అన్న కుమారుడైన ఉప్పాడ అప్పన్న కర్రతో దాడిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడని అన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.